


# మనిషికి అవసరమున్న మరొకటి

శ్రీపతి

అమ్మా, మనపొరుగింట్లోదిగుతున్నారే—వాళ్లు—ఆయన లెక్చరర్‌గారంట అమ్మా—వాళ్లు— మన చిన్నపిన్నంత ఉంటుం దమ్మా—ఆమె! లెక్చరర్ గారిభార్య అంట.' అని ఇంకేదో చెప్పబోయాడు. కాని చెప్ప లేక కూచున్నాడు కరుణ అమ్మ ఎదురుగా.

అమ్మ తోటకూర కడుగుతోంది. పక్కనే వత్తుల స్టౌ మండుతోంది. సాయంత్రం వంట చేసుకోవటంలో వుంది అమ్మ కాలేజీ నించి వచ్చాను ఇంకా ముఖమన్నా కడుక్కో లేదు. వాడి గొంతు వినీవినడంతోనే ఏమిటా అని వెళ్లాను.

'అమ్మా, ఒకమ్మాయి వుండే. వాళ్ల అమ్మాయేనంట' అన్నాడు నేను బాత్‌రూం వేపు వెళ్లడం చూసి

దాంతో అందమైన ఆలోచన ఒకటి తట్టింది. ఆ అమ్మాయి వీడిక్లాసే అయి లేనో! రోజూ అమ్మాయి వీడిని పిలవటానికి వస్తేనో! ఆడపిల్లలంటే వీడికి తగని సిగ్గు. ఆ సిగ్గు పోగొట్టానికి పెద్దన్నయ్య చెయ్యని ప్రయత్నమంటూ లేదు.

రెండో దినం ఆ అమ్మాయిని బడిలో చేర్పాలనుకుంటున్నారని ఆ పక్కింటి రాధమ్మ చెపితే నా ఊహలు నిజమవుతున్నంత సరదాగా వుంది. ఆ రోజే ఆ ఇల్లాలు 'ఏమండీ' అంటూ ఇంటికి వచ్చారు. వరండాలో కూచుని రజనీ నేనూ మాట్లాడుకుంటు న్నాము. అప్పుడే వచ్చాం కాలేజినించి.

'అమ్మగారున్నారా?' అని ఆమె బయట నించి

'ఉన్నారండీ, రండి' అని అమ్మతో పరి చయం చేశాను తీసుకుపోయి.

ఆ కొత్తదనంచూసి 'ఎవరు?' అందిరజని.

'పొరుగింట్లో దిగారు. విన్నవే'

'ఏం చేస్తున్నారంట?'

చెప్పాను—

అంతలో స్కూల్‌నించి బాబ్జీ, కరుణ, వాని, ప్రసాదు, శీను, స్వామి అంతా వచ్చారు. వాళ్లంతా కరుణ క్లాస్‌మేట్సు ఆరులో వున్నారు. కబుర్లుచెప్పుకుంటూవస్తున్నారు.

'అక్కయ్యా, పక్కింటిలో దిగారే—ఆ అమ్మాయిని మా స్కూల్లోనే చేర్పారు. మా క్లాసే' అన్నాడు బాబ్జీ.

బాబ్జీ ఎవరి గురించి చెపుతున్నాడో నాకు తెలుసు. అయినా అడిగి తెలుసుకోవా లని 'ఎవరు?' అన్నాను.

బాబ్జీ మళ్లీ విసుక్కోకుండా చెప్పాడు, 'మీ క్లాసేనా?'

'ఆ'

'ఆ అమ్మాయి బెజవాడలోనే చదువు కొండేదంట.' అని తెలిసిన సంగతులే తలో మాట చొప్పున గొడవ చేసి చెప్పారు

అంతకువరకు తలదించుకుని రాసు కుంటున్న పెద్దన్నయ్య పక్కకి తిరిగి కరుణ వేపు చూసి 'ఇంకేం?' అన్నాడు

కరుణ స్నేహితులంతా వెళ్ళిపోతామని చెప్పడంలో వెధవ వినలేదేమోనని వాళ్ళు వెళ్ళిపోయాకా మళ్ళీ 'జత దొరికిందిరా నీకు' అన్నాడు పెద్దన్నయ్య మళ్ళీ

'పో రాడీ' అనేసి అమ్మ దగ్గరికి వంట గదిలోకి వెళ్ళిపోయాడు కరుణ.

ఎప్పుడన్నా కరుణని ఏడిపించాలను కుంటే మా పెద్దన్నయ్య రెండు బాణాలు ఉపయోగిస్తాడు ఒకటి—బస్సు రెండు చిన్నకోడలు బస్సు సంగతేమిటంటే ఓరోజు ఇద్దరూ బస్సులో వస్తున్నారట అంతలో ఓ పాప యెక్కిందంట కరుణ పక్కనే సీటుందంట ఆ అమ్మాయి చక్కా వచ్చి వాడి పక్కనే కూచొందంట పెద్దన్నయ్య వాడి కళ్ళలోకి చూశాడుట దాంతో కరుణకి సిగ్గేసి లేచి నుంచొన్నాడట ఆ సంగతి పెద్దన్నయ్య భోంచేస్తున్న సమయంలో చెప్పాడు తింటున్న వాడల్లా తినడం మానేసి ఏడవడం మొదలెట్టాడు వెధవాయి అసలే వాడిని పెద్ద గుండ్రని కళ్ళు. ఆ కళ్ళల్లోకి దుఃఖం చేరితే అమ్మ భరించలేదు పెద్దన్నయ్యని గట్టిగా తిట్టింది 'సౌందర్య గురించినీలాకాదు' అంది

మా పెద్దన్నయ్య కథలు రాస్తాడు వాడి కథలన్నిటిలోనూ సౌందర్య వుంటుంది ఆ కథకూ సౌందర్యకూ సంబంధం లేక పోయినా సరే అందేత మేము 'పెద్దన్నయ్యా! యీసారి నీ కథలో సౌందర్య అవతార మేమిట్రా' అనడం కద్దు

కరుణ మరీ అల్లరి పనులు చేయడం ఆరంభిస్తే పెద్దన్నయ్య మెల్లగా అమ్మ దగ్గరికెళ్ళి, 'అమ్మా యీరోజు మన సీతారామయ్య గారింట్లో ఓ అమ్మాయిని చూశానూ మన చిన్నకోడలయితే'' కరుణకి వినిపించేట్టు చెప్తాడు దాంతో కరుణ అల్లరి తగ్గనన్నా తగ్గుతుంది లేదా హెచ్చనన్నా హెచ్చుతుంది.

'రౌడీవాడికి ఆ మాటల కంటే యింకేం తెల్సు?' అని కళ్ళల్లో కోపం ప్రకటిస్తాడు.

మూడోరోజున ఆ లెక్చరర్ గారమ్మాయి చంకన పుస్తకాల సంచి వేలాడేసుకొని, గేటు దగ్గర నుంచోని 'కరుణా, కరుణా' అని పిలుస్తోంది. కరుణ అమ్మ దగ్గర వంటగదిలో వున్నాడు పాలు తీసుకుంటున్నాడల్లే వుంది ఇదే మంచి అదనను కుని

'రా పాపా' అని పిలిచి, 'లోపలున్నాడు' అని చెప్పాను

పాప వరండాలోకి వచ్చి నుంచొంది

'నీ పేరు?'

'కమల'

'ఏ క్లాసు?'

'ఆరు' అని 'మా కరుణా నేనూ ఒకే క్లాసు' యింకా స్పష్టంగా వుండాలని చెప్పింది.

గొంతు ఖంగుమంటోంది

'ఇంతకు పూర్వం మీ నాన్నగా రెక్కడుండేవారు?'

'ఒక్కడేనండి'

'మరి నువ్వో?'

'మా పిన్ని దగ్గరుండేదాన్నండీ' అంది

'సరే, లోపలి కెళ్ళి పిలువ్ పాపా' అన్నాను

నా రెండో ఒడ అల్లుకుంటున్నాను ఒకసారి అర్థం ముందుకు—

వాళ్ళబడి ఎనిమిదికే అంచేత తొందరగా తెల్లారే తయారవాలి

కమల పావురంలా లోపలి కెళ్ళి 'కరుణా' అని పిలిచింది ఏం జరుగుతుందో చూడా లనిపించి మెల్లగా నేనూ వెళ్ళాను కరుణ ముఖం చూద్దును కదా తెల్లవోయింది పెద్దన్నయ్య బాత్‌రూం నించి అప్పుడే వస్తున్నాడు ఒక క్షణంపాటు చూసి -

'నీ పేరేమిటి పాపా?'

చెప్పింది

అయితే కమలా ఒకమాట చెప్తా విను రోజూ నువ్వూ కరుణా కలిసి బడికి పోతూండండి మా కరుణకు ఒంటరిగా పోవడం భయం అందుకే నీతో చెప్తున్నా 'అన్నాడు.

పెద్దన్నయ్య మాటలకి కరుణలో అసహాన భావం రేగింది కరుణ నోరెత్తలేదు ఎదురుగ్గా ఆ అమ్మాయి వుంది అందుకు

'అట్లాగేనండి' అని పెద్దన్నయ్య సలహా స్వీకరించి, 'కరుణా రా వేళవుతోంది' అని పిలిచింది ఆ పిలుపు వెనక ఏ భావాలూ లేవు ఏ సందేహాలూ లేవు వీణ మీటితే పలికిన రాగాలు. అంతే కొత్తవాళ్ళతో మాటాడాలంటే నాకు ఎన్ని ఆలోచనలు ముసురుకొస్తాయని!

కరుణ మారుమాటాడకుండా వెళ్ళిపోయాడు బడికి కమలతోపాటు

సాయంత్రం కాలేజీ నించి తిరిగి వచ్చే సరికి ఇంట్లో చిన్న ఎత్తున యుద్ధం జరుగుతోంది ఈ ఉదయం పార్సంతా రజనితో చెప్తే అది నవ్వుతోంది. ఆ నవ్వులతోనే వంట గదివేపు వెళ్ళాం.

'ఆ రౌడీవా డెందుకట్లా అనాలి?' హుంకరిస్తున్నాడు కరుణ అమ్మ, 'వాడు రానీరా వాడికి పెట్టాల్సిన గడ్డి పెడతాను. వెధవాయ్‌కి నీడి పూసెందుకో?' అని పెద్దన్నయ్యని నిజంగానే తిటుతోంది

అంతలో చిన్నన్నయ్య వచ్చాడు వీడ తామరాకు మీది నీటిబొట్టు. మూడో యేడు మెడిసన్ చదువుతున్నాడు. వాడి, స్నేహితులు, వాడి చదువులు వాడి గొడవేదో నాడిది తప్ప మా జోలికి రాడు. 'అచ్చం వాళ్ళ నాన్న పోలికే' అంటోంది అమ్మ చిన్నన్నయ్య వచ్చి తనే యింత టిఫిన్ గబగబా ప్లేట్లో పెట్టేసుకుని కూచున్నాడు తినటానికి అమ్మ స్టౌ మీద అన్నం దించేసి పాలు పెట్టింది పెద్దన్నయ్య నోటిని అదుపులో పెట్టనందుకు ఇంతసేపూ కరుణ అమ్మ మీద యుద్ధం ప్రకటిస్తున్నాడు వాడి ముందు పెట్టిన టిఫిన్ చల్లారి అట్లానే వుంది 'ముందు తిని మాటాడరా' అని అమ్మ బతిమాలుతున్నా వాడు వినిపించుకోవడం లేదు

'వాడు నిన్నేమనకుండ చూస్తాలేరా తిన్నా' అంది వాడు మొండికేసి కూచున్నాడేగాని తిన్లేదు ఆర్రాత్రి అమ్మ ఎంతో ప్రాధేయపడితేనే గాని వినలేదు వాడు. రాత్రి పదిగంటల సమయంలో పెద్దన్నయ్య వచ్చాడు వాడిని అమ్మ తిట్టింది

'నేనేమన్నానమ్మా? నన్ను తిడుతున్నావ్ రోజూ బడికి కలిసిపోతూండన్నాను అల్లరేప్పొద్దన్న అంటాను కూడా తనేం చెప్పు?' అని పెద్దన్నయ్య అంతటితో ఆగక 'సర్లే, వెధవా నీ గురించి కథ రాయబోతానా?' అని భయపెట్టి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు

ఆ మరుసటి దినం కమల వచ్చింది బడి వేళకి కమల రాకముందే కరుణ వెళ్ళిపోయాడు బడికి

'వచ్చేటప్పుడు కలిసి రండి' అన్నాను

మూడోరోజు సాయంత్రం

కమల అమ్మగారు వచ్చారు వస్తూ వస్తూ ఆమె అమ్మని 'వదినగారూ' అని పిలిచారు దాంతో మాకు అల్లరి చేయ్య

దానికి కావలసినంత అవకాశం దొరికింది. ఆమె వచ్చేసరికి ఇంట్లో అంతా వున్నాం. (మా మోహన్ బెజవాడలో వున్నాడులెండి)

అమ్మ మాఅందరినీ పరిచయం చేస్తూ —

'మా పెద్దబ్బాయి వాడు కథలు వ్రాస్తాడు. అన్ని పత్రికల్లోనూ పడుతుంటాయి. మీరు చూసే వుంటారు.

'వాడు రెండోవాడు. మెడిసన్ మూడో యేడు చదువుతున్నాడు. మూడోవాడు వాళ్ళ పిన్ని దగ్గరున్నాడు బెజవాడలో. వాడు తొమ్మిది. వారం పదిరోజుల్లో వచ్చేస్తాడు. మా వనజ పియూసీలో యీ యేడే చేరింది. వీడు చిన్నవాడు. మీకు తెలుసుకుంటాను. కమల చెప్పే వుంటుంది' అంది దగ్గరున్న కరుణని తట్టి చూపుతూ.

అమ్మని విడిపించుకుని కరుణ మెల్లగా నాన్నగారి గదిలోకి వెళ్ళిపోయ్యాడు. నాన్నగారు పరీక్ష పేపర్లు దిద్దుకుంటున్నారు. కరుణ పక్కనే కూచొని వీక్లీలోని బొమ్మలు చూసుకుంటున్నాడు.

'అల్లుడూ, రావోయ్ రా' అని అత్తయ్య గారు పిలిచారు.

'రారా అత్తయ్యగారు పిలుస్తున్నారు.' అని అమ్మ బతిమాలుతోంది.

అత్తయ్యగారు 'అల్లుడూ' అని పిలవడంతో ఒకసారి కరుణ మొఖం చూశాం.

# మనిషికి అవసరమున్న మరొకటి

వాడి చూపులు వాలిపోయాయి బలహీనంగా. దాంతో అమ్మ పిలుపు కూడా పట్టించుకో లేదు వాడు. అట్లాగే కూచున్నాడు. కదల్లేదు అక్కడ్నించి.

'మా అల్లుడికి మరీ సిగ్గయినట్టుంది'.

అమ్మ అంతలో కరుణని సమర్థించాలని 'వెధవకి ఎక్కడలేని సిగ్గు' అంది.

వెధవాయి సిగ్గు చూస్తే ముద్దొస్తుంది ఈ చేష్టలలో ఆడుకో బుద్ధి అవుతుంది. అందుకే నాన్నగారి గదికెళ్ళి 'రారా' అని చెయ్యి అందుకుని తీసుకురావాలని ప్రయత్నించాను. కాని మొండి కేశాడు. కదల్లా. ఇంకొంచెం పట్టుదల చూపి లాగితే ఏడిచేట్టున్నాడు. ఇంక లాభంలేదని నా ప్రయత్నంమాని నా మట్టుకు నేను బుద్ధిగా కూచున్నాను.

'మా అల్లుడు అలిగిపోయాడా' అని నావేపు చూసారు అత్తయ్యగారు. కరుణ వేపు చూసి ''ఏం కావాలో చెప్పు అల్లుడూ? అత్తయ్య మీద అంత కోపం చూపితే ఎట్లా?' అంది లాలనగా.

''అత్తయ్యగారి మీద కాకపోతే ఇంకెవరి మీద అలుక చూపిస్తాడండీ' అన్నాను. ఆమె కలుపుగోలు ధోరణికి అమ్మ సర్దుకో లేకపోతోంది. ఆమె 'ఏమిటో వింత మనుషులు' అని ఆదిలోనే గొణుక్కోకుండా ఉండాలని కల్పించుకున్నానేను.

అత్తయ్యగారు సన్నగా పొడుగ్గా ఆరోగ్యంగా వున్నారు. చీరకట్టులో అందముంది. ఎంచుకున్న చీర రంగులో నాజూకుతనముంది. నుదుట బొట్టు పెద్దగా వుంది. కుంకుమ కాఫీపొడి రంగుది. సన్నని బంగారు గాజులున్నాయి.

కరుణ నాన్నగారి గదిలో వున్నా తప్ప లేదని అక్కణ్ణించి తప్పుకోవాలని బయటికి పోబోతుండగా ఒక్కసారి అత్తయ్యగారు తన హాస్యధోరణంతా మారేసి 'నాయినా, కరుణా! ఇటురా' అని వయసుకు మించిన గంభీరతతో పిలిచారు.

కరుణ వచ్చాడు

'కలిసిపోదామని కమలంటే నువ్వు, ముందుగా బళ్ళోంచి వచ్చేశావట నిజమేనా?'

అత్తయ్యగారి కళ్ళల్లో నవ్వుమున్నట్టుంది అంచేతనే చూళ్ళేక తల దించుకున్నాడు. దోషి ఐనట్టుగా మొఖం చిన్నబోయింది.

'దానికీ వూరు కొత్త. ఆ బడి కొత్త, నువ్వు ఉన్నావ్ గదా అని పంపిస్తే నువ్వేమో విడిచిపెట్టి వెళ్ళిపోతున్నావాయె. రేపట్నించి బడికెళ్ళనంటోంది— ఏం చేయమంటావో చెప్పు?'

దించిన మొఖం ఎత్తలేకపోతున్నాడు.


'రేపట్నించి కమలతో పాటే వెళ్ళడం, కమలతో పాటే రావడం. మరి మీరేం బాధ పడొద్దండీ' అన్నాను.

ఆ క్రింది చూపుల్తోనే నా వేపు కొరకొరా చూశాడు.

కాఫీ చేసి తెమ్మని అమ్మ కళ్ళతో చెప్పింది. దాంతో నేను వంట గదికి వెళ్ళిపోయాను. తిరిగి కాఫీతో వచ్చేసరికి కరుణ లేడక్కడ అమ్మతో అత్తయ్యగారు బంధుత్వాలూ, స్నేహితులూ మొదలయిన సంగతులేవో మాటాడుకుంటున్నారు ఆ సత్యవతీ దేవి ఎవరో, ఆ ముకుందంగారి పెద్దమ్మాయి శకుంతల ఎవరో, ఆ కృష్ణమూర్తి ఎవరో నేనెరగను.

కరుణని ఎట్లా అమ్మ ఒప్పించిందో ఏమోగాని రెండో దినం కమల వచ్చేవరకు వాడు ఆగి వచ్చాకా కలిసి వెళ్ళాడు. ఇద్దరూ కలిసేవచ్చారు.

ఓ రోజు కమల బడినించి వచ్చేటప్పుడు పెద్దన్నయ్య ఆ పాపని మంచి మాటలతో



వంటగదికి తీసుకుపోయి పాలు కలిపిఇచ్చాడు తాగమని. అక్కడే కూచున్న కరుణ ముఖంలో భావాలు రంగులు మార్చుకున్నాయి. కమలని నేనో, అమ్మో తీసుకెళ్తే వాడంత బాధపడేవాడు కాదనుకుంటాను. పెద్దన్నయ్య తీసుకు వెళ్ళేసరికి తనని ఏడిపించటానికే అనిపించింది.

కమల చింతపువ్వుల పరికిణీ, జాకెట్టు తొడుక్కుంది. సన్నగా కొసలు సాచుతోన్న లతలా పెరిగింది. సన్నని చెంపకి చేరడేసి కళ్ళు. ఆ చూపుల్లో మనుషుల మీద నమ్మకమూ, ప్రేమా కనిపిస్తున్నాయి. చేతికందే సన్నని కంఠం. మనుషుల్లో తెల్లగా వుంటారంటారే ఆ తెలుపు ముక్కు చిన్నగా చూపులని గభాయిన లాక్కునేటంతటి అందంగా వుంది. అత్తయ్యగారు తన ప్రేమనంతటిని చూపించి కూతుర్ని ముస్తాబు చేసినట్టున్నారు. రెండు జెళ్ళు. కళ్ళకి కాటుక. నుదుట ఎర్రటి చిన్న బొట్టు గుండ్రంగా. ముద్దుగా చిన్న చెప్పులు. ఈ వర్ణనంతా కథ దిద్దిపెట్టినప్పుడు పెద్దన్నయ్య చేర్చాడు.

కొద్ది నిమిషాల తర్వాత అత్తయ్యగారు వచ్చి 'బాబ్జీ చెప్పాడు ఇక్కడుందని' అని అమ్మతో 'ఏం కూర చేస్తున్నా రొదినగారూ?' లాంటి ప్రశ్నలు వేసి కూతుర్ని తీసుకుపోయారు.

'పాలూ, పళ్లరసమూ టిఫిన్లూ పెట్టి కోడల్ని ఇప్పటినించే మంచి చేసుకుని మమ్మల్ని మరిపించేయా లనుకుంటున్నావా వదినా', అన్నారు అక్కడికి నాలుగయిదునాళ్ల తర్వాత వచ్చినపుడు.

'రేప్పొద్దున్న అత్తారింట్లో వుండాల్సిందేకాని, కన్నారింట్లో కలకాలం వుండిపోలేదు కదా. అందుకని ఇప్పట్నించి మంచి చేసుకోవాలనుకుంటున్నా నమ్మా' అంది అమ్మ.

ఆ రకంగా బంధుత్వం కంటె బలమైన తియ్యని స్నేహం ఏర్పడింది.

ఓ రోజు బెజవాడ నించి ఉత్తరం వచ్చింది. మోహన్‌ని కుక్క కరచేసిందట. హాస్పిటల్‌కి తీసుకెళ్లి బాబాయిగారు ఇంజెక్షన్‌లు ఇప్పిస్తున్నారట ఆ కబుర్లు. ఆ ఉత్తరం చదివి బాధపడ్డాం. అమ్మకి వెళ్లి మోహన్‌ని చూడాలనయితే వుందికాని వెళ్తేక్కడ తనని దూరం చేసింది అంటారోనని భయపడి గారుకుంది. ఆ నారు ... ... ... పుష్పవత అయిందని ఉత్తరం వచ్చింది. దాంతో అమ్మ బయల్దేరాల్సి వచ్చింది.

అమ్మ వెళ్లిపోయిన మరునటి దినం అత్తయ్యగారు వచ్చి ఎల్లుండి కమల పుట్టినరోజు పండగ' అని చెప్పారు. కరుణనీ అందర్నీ ఆహ్వానించారు.

కమల పుట్టినరోజు పండక్కి నేను కాలేజీలో ఎస్సేరైటింగ్ కాంపిటీషన్ వుండి వెళ్లలేకపోయాను. పెద్దన్నయ్య తన కొత్త కథని విశ్వనాథశాస్త్రిగారికి వినిపించాలని తెల్లారే వెళ్లి సాయంత్రం మూడుకి గాని రాలేకపోయాడు. నాన్నగారికి అస్సలు ఈ సంగతి చెప్పనేలేదు నేను. ఒంటరిగా కరుణ ఒకికి వెళ్లిపోయాడు.

కమల రాకముందే కరుణ ఒడికి వెళ్లిపోవడం, కమల కంటె ముందుగానో ఆలస్యంగానో బళ్ళోంచి రావడం నేను పసిగట్టాను. వాడ్నడిగి కారణం తెలుసుకోలేకపోతున్నాను. ఈ మార్పు కాస్త పెద్దన్నయ్యతో చెప్పాను.

అత్తయ్యగారు అమ్మ ఎప్పుడొస్తుందని అడిగారే తప్పించి అంతగా రావడంలేదు. అమ్మ లేకపోవడం వలనే అత్తయ్యగారు రావడం లేదనుకున్నాను.

ఈ మార్పు ఎవరికీ అర్థంకాలేదు.

వెళ్లిన వారందినాల తర్వాత అమ్మ తిరిగి వచ్చింది.

పోటీలో నెగ్గిన సంతోషం పంచుకోవటానికి రజని నాతోపాటువచ్చింది. కబుర్లు చెప్పుకుంటున్నాం.

'కరుణ అట్లా కూచున్నాడేం?' అంది రజని చెవులో మెల్లగా.

పడగ్గది మంచం మీద ఏదో కోల్పోయిన వాడిలాగ, చిగుళ్లు కోసేసిన మొక్కలాగ కన్పించాడు. ఈ వాక్యం పెద్దన్నయ్య కలిపిందే.

వాడు అట్లా వుంటానికి కారణముంది. రాత్రి అమ్మతో చెప్పాడు. అమ్మ ఉదయం అంట్లు తోముతో చెప్పింది నాకు. రజనితో ఆ కారణం చెప్పడం నాకు ఇష్టంలేదు. నాకే అగౌరవంగా వుంది. అంచేత 'పెద్దన్నయ్యో, అమ్మో ఏదో అనుంటారు' అనేశాను.

మరికొన్ని దినాలు పోయింతర్వాత ఓరోజు రజనే అంది. 'చూశావా వనజా, బాబ్జీ వాళ్ళమ్మగారు ఎప్పుడూ ఇక్కడే (అత్తయ్యగారింట్లో) ఉంటున్నారు.' అని.

'అవును.'

అప్పుడు — ఇంక ఆపలేకపోయాను, 'చూడూ, కమల పుట్టినరోజు పండక్కి మేం వెళ్లేదని అత్తయ్యగారి కోపం. మన ఇంటికి కమల వెళ్లొద్దందట. ఆ రోజు నేను ఎట్లా వెళ్లడం రజనీ—నీకు తెలుసు గదా—నాకు ఎస్సేరైటింగ్ కాంపిటీషన్, అమ్మ బెజవాడ వెళ్లింది. పెద్దన్నయ్యతో చెప్పాను. వాడేమో శాస్త్రిగారి దగ్గరుండిపోయాడు. అమ్మ లేకపోవడంతో వచ్చిందంతా.'

నాకు వెలితిగా వుంది. అత్తయ్యగారు వచ్చి కబుర్లు చెప్పడం, పరిహాసాలు చేయడం, ఎంతో చనువుగా మంచిచెడ్డలు చెప్పుకోవడం, బంధుత్వాలు కలుపుకోవడం, యివన్నీ ఒక్కసారి పోయాయన్న బాధతో పాటు అంత సన్నిహితంగా వుండేవాళ్లు ఇప్పుడేమొచ్చి దూరదూరంగా వుంటున్నారని సహజంగా ఇరుగుపొరుగు అనుకుంటారు. వాళ్లలోనో మాలోనో దోషం చూపిస్తారు. మొదట్లో ఈ పరిచయం కోసం తాపత్రయపడలేదు. అత్తయ్యగారే వచ్చార్లు. కమలే పిలిచింది వచ్చి. ఇప్పుడు—

అమ్మ 'పోనీయవే, ప్రపంచానికి బెంగపెట్టుకుంటే బతికినట్టే. వాళ్ళ కిష్టముంది వచ్చారు. ఇప్పుడిష్టంలేదు రాలేదు. దానికో పెద్ద బాధెందుకు?' అని నన్ను సమాధానపరచాలని అనేసింది కాని లోలోన లోటుకు గురవుతోంది.

ఈ సంగతులేవీ రజనితో చెప్పదలచుకోలేదు. అవి చెప్పడం వలన మంచి కంటె చెడుఎక్కువ వుంది. నా ఆత్మాభిమానం దెబ్బ తింటుంది నా తమ్ముడు ప్రైజు సంపాదించుకున్నాడన్నప్పుడు పొందిన సంతోషం వేరు. అది నేను ప్రకటించకుండా వుండలేను. నా తమ్ముడు ఫేలయ్యాడన్నది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నా తప్పు.

వరే అత్తయ్యగారికిని ఏమాకర్షించింది బాబ్జీలో? కరుణ కంటె తెలివైనవాడేం కాదు. క్లాసులో కరుణకున్న మంచిస్థానం కూడా బాబ్జీకి లేదు. కరుణ స్నేహాన్ని కోరి వచ్చాడు. వాడి స్నేహం కోల్పోయినందుకు వాళ్ళు బాధపడాలి కాని నేను కాదు. మా కరుణ చాలా గొప్పవాడు అవుతాడు. చాలా గొప్పవాడు అవుతాడు. నేనేకాదు వాడిని చూసిన వాళ్ళ టీచర్ శ్యాంగారు కూడా అదే చెప్పారు. ఎవరన్నా ఈ సంగతి చెప్పగలరు.

* * *

అమర్ కోస్
(రిజిష్టర్డు)
స్వచ్ఛమైన గ్లూకోస్ పొడి. శీతల పానీయాలలో కలిపి త్రాగండి. చక్కెరకు బదులుగా అమర్ కోస్ వాడి చూడండి. ఎంత వ్యత్యాసముంటుందో మీకే తెలుస్తుంది. అదనపు పుష్టి ఇస్తుంది. యువకులకు, ముసలివాళ్లకు కూడా మంచిది, జబ్బుపడి లేచిన తర్వాత, ఆరోగ్యంగా వున్నవారుకూడా వాడితే మంచిది. చాలా ఆదాయకరమైనదికూడా.
అమర్ చంద్ శోభాచంద్
మద్రాసు-1.

GP-AS.11

వాడుకకు సిద్ధముగా నుండు
కేశవర్ధిని
రెడిమిక్స్‌డ్ హేర్ ఆయిల్
కొనండి.


అన్ని స్టోర్లలో లభించును.
కేశవర్ధిని ప్రొడక్ట్సు
మద్రాసు-14.

# మనిషికి అవసరమున్న మరొకటి

వారం దినాలు గడిచాయి. కరుణ ఎప్పటి ఉత్సాహంతో ఉన్నాడు. కమల బాబ్జీ కలిసే వస్తున్నారు. ఆటలకి పోతున్నారు కబుర్లు చెప్పుకుంటున్నారు. పెన్సు పోయిందనీ, పుస్తకాలు కావాలనీ, క్లాసులో ఎవరో కొట్టుకున్నారనీ, టీచర్ ఏదో తప్పు చెప్పాడనీ, హెడ్మాష్టరు నత్తిమాటలు ఇలా వుంటాయనీ, స్కూల్లో పూలమొక్కలుకు నీరు పోసింది ఎవరనీ—ఏవేవో—నాకు చాల ఇష్టంగా వుండే సంభాషణలు వింటున్నాను.

ఆ మధ్య—

ఒకరోజు అత్తయ్యగారు వచ్చి, 'సత్యనారాయణవ్రతం చేస్తున్నా వొదినగారూ కమల పుట్టిందినానికి లేకుండాపోయారు. ఇప్పుడు అల్లా వీల్లేదు' అని గతంలో అసలు ఏమీ జరగనట్టుగా చాలా తెలివిగా ఆహ్వానించి వెళ్లారు.

అమ్మ ఎప్పటి ధోరణిలోనే ప్రవర్తించింది.

మా అమ్మని చూస్తే నాకు నవ్వొస్తుంది. ఒత్తి పిచ్చిది. ఇతర్ల తాలూకు ఉద్దేశాలూ, ఊహలు తనకి పట్టవు. అర్థం చేసుకోదు. వాళ్ల ప్రయోజనాలూ, వాళ్ల గొప్పతనాలు ఏదో రకంగా వ్యక్తం చేసుకోవాలని చేసే ప్రయత్నాలేవీ గుర్తించలేదు.

ఎందుకు ఈ వివరణ ఇస్తున్నానంటే ఆ రోజు సత్యనారాయణవ్రతానికి వెళ్లినప్పుడు బాబ్జీఅమ్మ(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు గారి భార్య) గారూ, మరికొందరూ అత్తయ్యగారంటే వారు చూపుతున్న గౌరవాభిమానాలు, ప్రేమాదరణలు, ఆమె స్వల్ప కాలంలో సంఘంలో సంపాదించుకున్న పలుకుబడి ప్రకటించే ప్రయత్నం జరిగింది. నిజానికి బాబ్జీ అమ్మగారు ఒకసారి—బాబ్జీ సాయంత్రం ఎనిమిదింటివరకూ రాలేదని తెలిసినప్పుడు—వచ్చి అమ్మతో పరిచయం చేసుకున్నదే. కాని ఆమెకి అమ్మతో పరిచయానికి, స్నేహానికి ఆకర్షణలు ఏవీ కనిపించలేదు. అమ్మకి క్లబ్బులూ, మహిళా సమాజాలూ తెలీవు. జడ్జీల భార్యలతోనూ, లాయర్ల భార్యలతోనూ, ఆ పట్టణంలో వున్న 'దిసోకాల్డ్ సివిలైజడ్ ఎండ్ ఎడ్యుకేటెడ్ క్లాస్ పీపుల్'తో సంబంధాలు లేవు అమ్మకి. వాళ్ల విజ్ఞానం గురించి, వాళ్లు సంఘానికి చేస్తున్న అపారమైన సేవ గురించి తెలీదు అమ్మకి.

అసలు అత్తయ్యగారు చేసే వ్రతాలకీ, పండుగలకీ సాంఘిక ప్రయోజనాలు ఎక్కువగా వుంటాయి. అదే రజని కూడా గుర్తించింది. అప్పుడు అనిపించింది. అత్తయ్యగారు మొదట్లో అంత దగ్గరైపోటానికీ తర్వాత అంత పలకరించకుండా మరచిపోటానికీ, మళ్లీ అసలు ఏమీ జరగనట్టు అతి నిర్మలంగా ఉన్నట్టు వచ్చి పలకరించటానికీ అక్కడ అర్థం ఉంది.

ఓ రోజు వర్షం పడింది. ఆ వర్షంలో బడినించి వస్తున్న పిల్లలంతా పరుగు తీసుకుంటూ వచ్చారు. ఆ పరుగులో ఏదో ఆకు మీద జోడుతో వున్న కాలు జారి ప్రక్కనే వున్న లైట్ స్థంభానికి తల తగిలి కొద్దిలో సైడుకాలవలో పడిపోయే ప్రమాదం తప్పి కమల హాస్పిటల్‌లో గాయాలతో వుంది.

'ఓ సారి చూసి వద్దామమ్మా' అన్నాను అమ్మతో. ఎందుకో నాకు భయంగా వుంది. చిన్నపిల్ల. ముద్దు మాటలు. నచ్చే ప్రవర్తన. కమల గాయాలతో ఎలా వుందో చూడాలని బుద్ధిపుట్టింది. అమ్మని రమ్మన్నాను. సాయంత్రం విజిటింగ్ అవర్స్‌లో వెళ్లేసరికి చిల్డ్రన్ వార్డ్‌లో కాలుని పైకి ఎత్తికట్టి చిన్నమంచం మీద కమలని పడుకోబెట్టారు. తల మీద గాయాలకి పెద్దకట్లున్నాయి.

తీసుకువెళ్లిన పళ్లు కమలకి వొలిచి పెట్టాను. కమల తింది. మాట్లాడింది. మరో వారందినాల తర్వాత వచ్చేయటానికి వీలుంటుందని అత్తయ్యగారు చెప్పారు. ఆమె కళ్లల్లో కాంతి చాలా మారింది.

అత్తయ్యగారు చెప్పిన విషయాల్లో చాలముఖ్యమైన విషయం ఏమిటంటే 'ఇన్‌స్పెక్టరుగారి భార్య(అంటే బాబ్జీ తల్లి) మేజిస్ట్రేట్ గారి అబ్బాయి పుట్టినరోజు పండక్కి వాళ్ల అబ్బాయికి చాలా ఖరీదయిన వ్యూమాష్టర్ కొని ప్రజెంట్ చేసారట. అని చెప్పి యింకా ఏదో చెప్పబోయి ఆగిపోయారు. ఆ చెప్పబోయినదేదో ఆమె మీద నిందలాంటిది అయుండాలనిపించింది. లంచాల వలన వచ్చిన డబ్బేకనా, ఇచ్చే ప్రజెంట్‌కి ప్రతిఫలం కూడా వుండాలి కదా లాంటి మాట ఏదో ఆమె మనసులో మెదిలి చెప్పటానికి ధైర్యం చాలక ఊరుకున్నారామె. బాబ్జీ తల్లి రాలేదని, మన షులంటే ఏమిటో కష్టాల్లో వున్నప్పుడే

తెలిసొస్తుందనీ ఆమె వివరించారు.

వచ్చేస్తున్నప్పుడు—

"వదినగారూ, రేపు మీరు వచ్చేటప్పుడు కరుణని కూడా తీసుకు రండి" అన్నారు.

కమల భాష అర్థం కానట్టుగానే చూసింది. ఇంకా బాధ తీవ్రత తగ్గలేదు.

వచ్చేస్తుంటే మాతో పాటు వార్డు ద్వారంవరకూ వచ్చారామె. ఆమె నడకలో ఇప్పుడు చురుకుదనం లేదు. ఆమె మాటల్లో ఇప్పుడు ఉత్సాహం లేదు. ఆమె చూపుల్లో ఇప్పుడు ఇతర్లని ఆకర్షించాలనే తపనలేదు. ఆమె గొంతులో వాగ్ధాటి లేదు.

ఓడిపోయానన్న దీనత్వమూ లేదు. దిగులూ లేదు.

అత్తయ్యగారిని చూస్తే నాకు జాలేసింది. సమాజంలో స్థానం సంపాదించుకోటానికి ఆమె చేసిన ప్రయత్నాలు వ్యర్థమయ్యాయని ఆ నిమిషాన తెలిసినట్టయింది.

'మరచిపోరు కదూ' అన్నారామె.

దేన్ని మరచిపోరు కదూ అన్నారామె? కరుణను రేపు తీసుకు రావడాన్ని మరిచిపోరు కదూ—అనికాదు. ప్రేమాభిమానాలని చూపడం, ఈ ఓదార్పు నివ్వడం, సమాజంలో నిజమైన బంధుత్వాన్ని కలిగి వుండడం ముఖ్యంగా తన కుమార్తె ఆరోగ్యవంతురాలయి, కుంటిదిగా కాకుండా, జీవితంలో స్నేహానురాగాలు పెంచుకోవడం—అనిపించింది.

మేం వచ్చేస్తున్నప్పుడు లెక్చరర్‌గారు కనిపించి, పలకరింపు చూపు చూసి, తల దించుకుని తన భుజాన వేలాడుతోన్న ఫ్లాస్కుతో, తన చేతిలోని ఏళ్ళతో లోపలికి వెళ్ళిపోయారు.

ఆ రెండో దినం కరుణని తీసుకొని వెళ్ళినపుడు, కరుణని చూసి కమల చూపులు వికసించాయి.

'నా పూలమొక్కలకి ఎవరు నీరు పోస్తున్నారు?' అడిగింది కమల.

'వర్షాలు పడుతున్నాయి కదా ఎవ్వరూ నీరు పొయ్యడం లేదు.' అని చెప్పి 'రేపు మన క్లాసు పిల్లలంతా నిన్ను చూట్టానికి వస్తున్నా'రన్నాడు.

ఆ మాట విన్నప్పుడు, కమల ముఖంలోని కాంతి చూసి అత్తయ్యగారు ఎంత ఆనందించారో!

(ఈ కథని ఇలా ముగిస్తే పెద్దన్నయ్య బాగా లేదన్నాడు. అనవసరంగా పెంచినట్టుగా వుందన్నాడు. 'మేం వచ్చినప్పుడు లెక్చరర్‌గారు కనిపించి'—అన్న దగ్గర్నించి తీసెయ్యాలని తను ఎర్రగీతలు అడ్డంగా పెట్టాడు. ఇది కథగాదు. జీవితం. దీనికి ఆకర్షణీయమైన మలుపుని జీవితం నించి ఎన్నుకునే సామర్థ్యం నాకు లేకపోయింది. నువ్వే ముగింపు చెప్పకూడదురా—అంటే 'అట్లా చెప్పను. కథలు రాయడం చెపితే వచ్చేది కాదు. తనే తప్పులు చేసి, దిద్దుకుని ఇతర్ల అభిప్రాయాలూ, విమర్శలూ అర్థం చేసుకుని, కథలు చదివి అవి మంచివైతే ఎట్లా మంచివయ్యాయో, గొప్పవయితే ఎట్లా ఏ సంఘటనల వలన, ఏ పాత్రల వలన, ఏ ఇతివృత్తం వలన, ఏ శిల్పం వలన, ఏ రచనావిధానం వలన, ఏ భావాల కూర్పు వలన, ఏ మనస్తత్వ పరిశీలన వలన, ఏ సామాజిక శక్తుల ప్రభావం కనిపించి—అది—ఆ కథ ఆకర్షించిందో—ఆరకంగా కథ సాధించిన ప్రయోజనమేమిటో—అర్థం చేసుకోవాలి. కథలు రాయడం స్వంతంగా నేర్చుకోవాలి. చెపితే, 'కథలు రాయడమెలా' అన్న పుస్తకాలు చదివితే రాదు' అన్నాడు. అవన్నీ తెలుసుకునే వరకూ, ఆ చిత్రికలన్నీ పెట్టి ప్రతిభావంతుడయిన శిల్పి చేసిన శిల్పం లాగ తయారయ్యే వరకు ఆగలేను కాబట్టి ఇది ఇలాగే వుంచేస్తున్నాను.) ●